260) మాళవిగౌళ/మాయామాళవ గౌళ

ప॥ ఏమాయ నిందుకు నీవెగ్గులేల పట్టేవు। కామిని నీచెక్కు నొక్కి కైకొనవయ్య॥

చ॥ పడతి నోరెత్తితేను పగడాలే రాసులయ్యీ। యెడపు నిన్ను దిట్టితే నేమాయనయ్యా।
కడలేని రత్నాలు గానుక వచ్చిన నీవు। తడవి బండారాన దాచుకోవటయ్యా॥

చ॥ మగువ చూపులవంక మాణిక్యాలే రాలీని। తగ గోపించి చూచితే తప్పటవయ్యా।
సొగిసి మణులు దాచి సొమ్ములు నీకిచ్చితేను। జిగి మేన ధరియించి చెలగవటయ్యా॥

చ॥ ముంచి చెలి నవ్వితేను ముత్తేలే రాలీని। యించుక గేలిసేసితే నేమాయనయ్యా।
పెంచెపు శ్రీవేంకటేశ పెండ్లి ముత్యాలసేస। వంచి కూడి చెలి మాన వచ్చునటయ్య॥